నేడు బండ్లగూడ మున్సిపల్ ప్రత్యేక సమావేశం

బండ్లగూడ: కిస్మత్‌పూర్‌లోని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ హాల్‌లో బడ్జెట్‌పై శనివారం ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. శనివారం ఉదయం 11 గంటలకు కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ఆర్థిక సంవత్సరం 2025–26 అంచనా బడ్జెట్ ప్రత్యేక సమావేశం ప్రత్యేక అధికారి పి.శ్రీధర్ అధ్యక్షతన జరుగుతుందన్నారు.

బండ్లగూడలో కమిషనర్ సుడిగాలి పర్యటన


వాటరింగ్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్‌లలో కమిషనర్ శరత్‌చంద్ర శుక్రవారం పర్యటించారు. తెలంగాణ కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఆదేశాల మేరకు వన్ డే వన్ థీమ్ కార్యక్రమంలో భాగంగా బండ్లగూడ కార్పొరేషన్‌లోని 12వ డివిజన్‌లోని అప్పా జంక్షన్ ప్రధాన రహదారిలో, 13వ డివిజన్‌లోని పీరంచెరువు ప్రధాన రహదారిలో మిడియన్ అండ్ ఎవెన్యూ ప్లాంటేషన్‌కి వాటరింగ్, 11వ డివిజన్‌లోని దర్గాఖలీజ్ ఖాన్‌లో ప్లాంటేషన్ ఏరియా క్లీనింగ్ ప్రక్రియను పరిశీలించారు. శానిటరీ జవాన్లు మీర్జా తౌఫిక్, శాంసన్, రాము తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

శంషాబాద్ రూరల్: రాజీవ్ యువ వికాసం పథకం కోసం ఏప్రిల్ 5 వరకు దరఖాస్తు అందజేయాలని ఎంపీడీఓ మున్నీ తెలిపారు. యూనిట్ ధర రూ. 50 వేల నుంచి రూ. 4 లక్షల వరకు ఉంటుందన్నారు. ఓబీఎంఎంఎస్ పోర్టల్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుని, వీటి పత్రాలను మండల ప్రజా పాలన కేంద్రాల్లో అందజేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల వారు ఏడాదికి రూ. 1.5 లక్ష ఆదాయం, పట్టణ ప్రాంతాల వారు రూ. 2 లక్షల ఆదాయం కల్గి ఉండాలి. వ్యవసాయేతర రంగాల యూనిట్లకు 21 నుంచి 55 ఏళ్ల వయస్సు కల్గిన వారు అర్హులని తెలిపారు. వ్యవసాయ, అనుబంధ రంగాల యూనిట్ల కోసం 21 నుంచి 60 ఏళ్ల వయస్సు అర్హత ఉండాలన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడాలని వినతి

శంషాబాద్: శంషాబాద్‌లో ప్రభుత్వ భూముల కబ్జా షరా మామూలే అన్నట్లుగా మారిందని సీపీఎం నాయకులు మండిపడ్డారు. ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నా ప్రభుత్వాధికారులు స్పందించడం లేదన్నారు. ప్రభుత్వ భూములను కాపాడాలంటు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మున్సిపాలిటీతో పాటు మండల పరిధిలోని అనేక గ్రామాల్లో కొందరు మాఫియాగా మారి ప్రభుత్వ భూములు, చెరువులపై కన్నేసి కబ్జాచేస్తున్నారన్నారు. దీనిపై రెవిన్యూ, ఇరిగేషన్ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారన్నారు. అసైన్డ్ భూముల్లో కూడా కొందరు పెద్దలు పెద్ద ఎత్తున గోదాములు సైతం నిర్మాణం చేపడుతున్నా అధికారులు చర్యలెందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. రెవిన్యూ అధికారులు వెంటనే ప్రభుత్వ భూములను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు నీరటి మల్లేష్, ప్రణయ్, పవన్, సామిల్, మల్లేష్ పాల్గొన్నారు.

నీటి సంరక్షణపై విద్యార్థులకు అవగాహన

గోల్కొండ: నీటిని పొదుపుగా వాడుకోవాలని కార్వాన్ జాఫర్‌గూడ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.వినోద్‌కుమార్ అన్నారు. శుక్రవారం పాఠశాలలో నీటి సంరక్షణపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..భూమిపై కురిసిన ప్రతి నీటి బొట్టు ను ఒడిసిపట్టుకొని దానిని భూగర్భ జలంగా మార్చాలన్నారు. అంతేకాకుండా నల్లాల నుంచి నీటి వృథాను ఆపాల్సిన అవసరం ఉందన్నా రు. నీటిని భూగర్భ జలంగా మార్చుకోవడానికి తమ పాఠశాలలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేశామన్నారు. బీసీ ఐక్యవేదిక అధ్యక్షుడు మల్లికార్జున్, బీజేపీ సీనియర్ నాయకులు రాధాకృష్ణయాదవ్, జలమండలి అధికారి దొరబాబు పాల్గొన్నారు.

సామాజిక సేవతో నాయకత్వ లక్షణాలు

గోల్కొండ: సామాజిక సేవతో నాయకత్వ లక్షణాలు అలవడుతా యని రాయల్ టింబర్స్ మేనేజర్ మహ్మద్ షహబాజ్ అన్నారు. తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ పేరుతో 15 ఏళ్లుగా నిరుపేదలకు సేవలు అందిస్తున్న మహ్మద్ నజీబ్‌ను శుక్రవారం ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహ్మద్ నజీబ్ సేవా కార్యక్రమాలతో ఎందరో యువకులు ముందుకు వచ్చి సేవా సంస్థలు ఏర్పాటు చేయడం స్వాగతించదగ్గ విషయమన్నారు. మునుముందు కూడా నజీబ్ సేవా కార్యక్రమాలు కొనసాగించాలన్నారు. అబీబ్, అబ్దుల్ బారీ, మహ్మద్ ఫహాద్ పాల్గొన్నారు.

మున్సిపాలిటీలకు కాసుల గలగల

- గత రికార్డులకు చేరువలో కలెక్షన్లు
- పన్నులు పెరగటంతో ఇబ్బంది
- మరో మూడు రోజులే గడువు


మణికొండ మున్సిపాలిటీ వ్యూ చిత్రం

మణికొండ: మున్సిపాలిటీలలో పన్నుల వసూలు పెరగటంతో కాసుల గలగల నెలకొంది. ప్రతి సంవత్సరం మున్సిపాలిటీలకు ప్రజలు ఆస్థి పన్నులు చెల్లించటం ఆనవాయితీ. సంవత్సరంలో ఏప్రిల్‌లో 5 శాతం రాయితీ ఇస్తుండటంతో కొంత మంది అప్పుడే చెల్లించి దాన్ని పొందుతారు. మరి కొంత మంది సంవత్సరం పొడవునా చెల్లింపులు చేస్తుంటారు. అత్యధిక మంది మాత్రం మార్చి నెలలోనే పన్ను చెల్లింపులు చేస్తుంటారు. దాంతో సంవత్సరంలో 11 నెలలు వసూలు అయినంత ఒక ఎత్తుగా ఉండగా ఒక్క మార్చి నెలలోనే అదే స్థాయిలో వసూలు అయి కలెక్షన్ రికార్డులను సృష్టిస్తుంది. హైదరాబాద్ నగర శివారులో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న మున్సిపాలిటీలు అయిన మణికొండ, నార్సింగిలలో అదే స్థాయి పన్ను డిమాండ్ ఉంటుంది. దాన్ని పూర్తి స్థాయిలో వసూలు చేసేందుకు మున్సిపల్ కమిషనర్ స్థాయి నుంచి బిల్ కలెక్టర్ వరకు శ్రమిస్తున్నారు. గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్‌ల వారిగా సమావేశాలు పెట్టి పన్నులు చెల్లించాలని కోరుతున్నారు. ఈ సంవత్సరం ప్రభుత్వ కార్యాలయాలను సైతం వదలకుండా పూర్తి స్థాయిలో పన్నులు వసూలు చేసేందుకు కృషి చేస్తున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా పెరగని పన్నులు ఈ సంవత్సరం మణికొండ మున్సిపాలిటీ పరిధిలో ఒక్కసారిగా పెంపుకు గురికావటంతో ప్రజల నుంచి అదే స్థాయిలో ఆక్షేపణలు వస్తున్నాయి. వాటిని అధిగమిస్తూ పూర్తి స్థాయిలో పన్నులు వసూలు చేసి ఉన్నతాధికారుల నుంచి శభాష్ అనిపించుకోవాలనే తాపత్రయంతో పోటీలు పడుతున్నారు. పన్నుల వసూలుకు మరో నాలుగు రోజులు మాత్రమే సమయం ఉండటంతో సెలవులను సైతం పట్టించుకోకుండా నిర్విరామంగా కృషి చేసి ఉత్తమ ఫలితాలను రాబట్టేందుకు వారు సిద్ధమయ్యారు.


గేటెడ్ కమ్యూనిటీలకు వెళ్లి పన్ను వసూలు చేస్తున్న అధికారులు

ఇవీ పన్ను రాబడులు ..

నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి పన్ను డిమాండ్ రూ. 46.29కోట్లు ఉండగా ఇప్పటి వరకు రూ. 37.89 కోట్లు వసూలు చేశారు. ఒక్క మార్చి నెలలోనే గురువారం వరకు రూ. 7.21 కోట్లను వసూలు చేసి 82శాతం కలెక్షన్‌లకు చేరుకున్నారు. గత సంవత్సరం 85.49శాతం వసూలు చేశారు. ఇక మణికొండ మున్సిపాలిటీ పరిధిలో రూ.70.52కోట్ల డిమాండ్ ఉండగా ఇప్పటి వరకు రూ. 38.61కోట్లు వసూలు చేశారు. మార్చి నెలలోనే రూ. 26.65కోట్లు వసూలు చేసి 61శాతం కలెక్షన్‌లకు చేరుకున్నారు. గత సంవత్సరం 69.83శాం వసూలు చేశారు. ఈనెలలో మిగిలి ఉన్న నాలుగు రోజులలో అత్యధికంగా కలెక్షన్‌లను రాబట్టి నార్సింగిలో 95 శాతం, మణికొండలో 90 శాతం కలెక్షన్‌లకు చేరుకునే ప్రయత్నంలో ఉన్నారు.

పన్నులు చెల్లించాలి



మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ప్రజలు తమ ఆస్థిపన్నులను పూర్తి స్థాయిలో చెల్లించి సహకరించాలి. పన్ను చెల్లింపు ఆలస్యం అయితే వాటికి వడ్డీలు జత కలుస్తాయి. ప్రతి గేటెడ్ కమ్యూనిటీ, అపార్ట్‌మెంట్‌కు వెళ్లి పన్నుల వసూలుకు ప్రత్యేక క్యాంపులు, ప్రచారం నిర్వహిస్తున్నాం. ఈ సంవత్సరం పెరిగిన పన్నులతో కొంత ఇబ్బంది కలిగింది. అయినా అధిగమించి గతం కన్నా అధికంగానే కలెక్షన్‌లను రాబడుతున్నాం.

– డి.ప్రదీప్‌కుమార్, కమిషనర్, మణికొండ మున్సిపాలిటీ

పన్నులతోనే ప్రగతి



ప్రజలు మున్సిపాలిటీలకు చెల్లించే పన్నులతో ప్రజలకు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టే అవకాశం ఉంటుంది. పూర్తి స్థాయి పన్ను చెల్లింపులు ప్రతి ఒక్కరు చేస్తే అదే స్థాయిలో పనులు వేగంగా కొనసాగుతాయి. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడా జరగని అభివృద్ధి పనులను చేపడుతున్నాం. ఇప్పటి వరకు పన్నులు చెల్లించని వారు రాబోయే నాలుగు రోజుల్లో చెల్లించి సహకరించాలి.

– టి.కృష్ణమోహన్‌రెడ్డి, కమిషనర్, నార్సింగి మున్సిపాలిటీ

మణికొండలో పన్ను వసూళ్లపై హైకోర్టు స్టే

అడ్డగోలుగా పెంచారని వాదన

మణికొండ: ఉన్న పన్నును రెండింతలు చేయటమే చట్ట విరుద్ధం.. అలాంటిది ఏకంగా ఐదింతలు చేసి ప్రజల నుంచి ముక్కు పిండి వసూలు చేస్తున్న మున్సిపల్ శాఖపై ప్రజలు హైకోర్టును ఆశ్రయించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కొత్తగా మున్సిపాలిటీలుగా ఏర్పడిన వాటికి మూడు సంవత్సరాల వరకు ఎలాంటి పన్ను పెంపు ఉండదని అప్పట్లో రాయితీ ఇచ్చారు. ఆ గడువు ముగియటంతో రెండు సంవత్సరాల క్రితం అనేక మున్సిపాలిటీలలో పన్ను పెంపు చేపట్టారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలో సాంకేతిక సమస్యలతో ఆ పెంపు కాస్తా గత సంవత్సరం నవంబర్ 1వ తేదీ నుంచి అమలు చేశారు. దాంతో అప్పటికే పూర్తి స్థాయిలో పన్నులు చెల్లించిన వారితో పాటు చెల్లించని వారికీ పన్ను బకాయిలు చూయించారు.



వాటిని కట్టాల్సిందేనని ఇంటింటికి తిరిగి ఫిబ్రవరి నుంచి వసూలు కార్యక్రమం మొదలు పెట్టారు. అప్పటి వరకు వందల్లో ఉన్న ఇంటి పన్నులు కాస్త ఏకంగా వేలల్లో రావటంతో అనేక మంది లబోదిబోమన్నారు. అదే విషయాన్ని 'సాక్షి' దినపత్రిక ఫిబ్రవరి 7వ తేదీన 'పన్ను పోటు.. తలపోటు' శీర్షికన కథనం ప్రచురించింది. దాంతో మున్సిపాలిటీ పరిధిలోని ఆల్ కాలనీస్ రెసిడెన్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు మున్సిపల్ కమీషనర్, మేనేజర్‌లతో సమావేశమై పన్ను పెంపు ప్రక్రియను వ్యతిరేకించారు. అయినా అధికారులు పట్టించుకోకపోవటంతో ఫెడరేషన్ ఆధ్వర్యంలో మొత్తం 15 మంది ఇటీవల హై కోర్టును ఆశ్రయించారు.

పెంపు పన్నులపై స్టే...

మణికొండ మున్సిపాలిటీ పరిధిలో అడ్డగోలుగా పెంచిన పన్ను వసూళ్లపై రాష్ట్ర హై కోర్టు శుక్రవారం స్టే ఇచ్చిందని ఆల్ కాలనీస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి, పిటిషన్‌దారు వి.ఆంజనేయులు తెలిపారు. గతంలో ఉన్న పాత పన్నులను వసూలు చేసుకోవచ్చని, పెంచిన పన్నులపై తుది ఆదేశాలు వచ్చే వరకు వసూలు చేయవద్దని సూచించిందన్నారు. తిరిగి ఏప్రిల్ 17వ తేదీన విచారణ ఉంటుందన్నారు. తుది తీర్పు ప్రజలకు మేలు కలిగేలా వస్తుందని ఆశిస్తున్నామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ఉత్సవాలకు శాసనసభ స్పీకర్‌కు ఆహ్వానం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ జై భీమ్ జై రామ్ జయంతి ఉత్సవ కమిటీ–2025 ఆధ్వర్యంలో రూపొందించిన డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ జయంతి ఉత్సవాల వాల్ పోస్టర్‌ను శుక్రవారం తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఆవిష్కరించారు. మహానీయుల జయంతి ఉత్సవాల కార్యక్రమానికి ప్రభుత్వం తరపున ముఖ్య అతిథిగా హాజరు కావాలని కోరగా స్పీకర్ స్పందిస్తూ తప్పకుండా పాల్గొంటానని తెలిపారు. ఉత్సవాల కమిటీ అధ్యక్షుడు ఎడ్లకాడి సూర్యం, ప్రధాన కార్యదర్శి దాసరి రమేశ్, కోశాధికారి మంగళారం శ్రీనివాస్, వ్యవస్థాపక అధ్యక్షులు పోయిల జీవన్‌దాస్, వర్రె లలిత్ తులసీరామ్, మాజీ అధ్యక్షుడు గోల్కొండ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

శతాధిక వృద్ధురాలి మృతి


బాలమ్మ (ఫైల్)

మణికొండ: శతాధిక వృద్ధురాలు మృతి చెందింది. నార్సింగి మున్సిపాలిటీకి చెందిన నిరుడు బాలమ్మ(105) శుక్రవారం మృతి చెందింది. ఆమె భర్త, ఓ కూతురులు గతంలోనే చనిపోయారు. ఆమె తన మరిది ఇంట్లోనే ఉండేది. గ్రామంలోనే ఆమె పెద్ద వయసు వృద్ధురాలిగా ఉండేది. ఆమె గతంలో నిజాం కాలంలో జరిగిన అకృత్యాలు, స్వాతంత్ర్యం వచ్చిన తీరును ప్రజలకు వివరించేదని స్థానికులు తెలిపారు. ఇంత కాలం ఆరోగ్యంగా జీవించటం ఎంతో గొప్ప విషయమన్నారు. గురువారం రాత్రి నిద్రలోనే ఆమె కన్నుమూసిందని, ఆమె అంత్యక్రియలు శుక్రవారం నార్సింగిలో పూర్తి చేశారు.

రైతులకు రుణాల పంపిణీ


మాట్లాడుతున్న చైర్మన్ దౌనాకర్‌గౌడ్

శంషాబాద్ రూరల్: మండలంలోని చిన్నగోల్కొండ సొసైటీ ఆధ్వర్యంలో రైతులకు శుక్రవారం రుణాలను పంపిణీ చేశారు. సొసైటీ చైర్మన్ బి.దౌనాకర్‌గౌడ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో 11 మంది రైతులకు రూ. 10 లక్షల స్వల్పకాలిక రుణాల చెక్కులను అందజేశారు. సరైన పత్రాలు లేని ఐదుగురు రైతులు, మృతి చెందిన 191 మంది రైతుల సభ్యత్వాన్ని రద్దు చేసినట్లు చైర్మన్ తెలిపారు. రైతులకు బంగారు రుణాలపై పది గ్రాములకు రూ. 50 వేల రుణం ఇవ్వనున్నట్లు చెప్పారు. డీసీసీబీ డైరక్టర్ మోహన్ రావు, సొసైటీ సభ్యులు దేవేందర్‌రెడ్డి, బాల్యానాయక్, ప్రశాంత్‌రెడ్డి, విజయలక్ష్మీ, రూప, సీఈఓ యాదయ్య, రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాజేంద్రనగర్: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. నాయుడు కాలనీ ఫీడర్ పరిధిలోని హైదర్‌గూడ, ఉప్పర్‌పల్లి, ఎర్రబోడ, వాంబే కాలనీ, నాయుడు కాలనీ పరిసర ప్రాంతాల్లో సాయంత్రం 4నుంచి 4.30 గంటల వరకు, ఫోర్ట్ వ్యూ కాలనీ విద్యుత్ ఫీడర్ పరిధిలోని ఫోర్ట్ వ్యూ కాలనీ, జన చైతన్య ఫేజ్–1, 2, గోల్డెన్ హైట్స్ కాలనీ పరిసర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి 3 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు.

హిమాయత్‌సాగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో...

బండ్లగూడ: హిమాయత్‌సాగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ బి.అమర్ సింగ్ తెలిపారు. కాళీమందిర్ ఫీడర్, పెద్ద మంగళారం ఫీడర్ పరిధిలో 2 నుంచి మధ్యాహ్నం 2.30 వరకు ఇండస్ వ్యాలీ, సంజయ్ గాంధీనగర్, భవానీ కాలనీ, బైరాగిగూడ, శివసాయినగర్, సుబ్రహ్మణ్యం కాలనీ, రంగారెడ్డి కాలనీ, దత్తాత్రేయ కాలనీ, వాల్మీకి ఆశ్రమం, శివపురి, గంధంగూడ గృహాలు, హీరా కాలనీ, సన్‌సిటీ మెయిన్ రోడ్డు, సీవైఆర్ కన్వెన్షన్, భాగ్యనగర్ ఓల్డ్ కాలనీ, కపిలానగర్, కె.కె.నగర్, హైదర్షాకోట్ ఫీడర్ల పరిధిలో 3 గంటల నుంచి 3.30 వరకు కె.కె–1, 2, సాయిబాలాజీనగర్, ఫీల్ గుడ్ హోమ్, శ్రీనివాసనగర్ కాలనీ, శ్రీనివాసనగర్ గుట్ట, కె.కె–4, కిష్టారెడ్డి కాలనీ, విఘ్నేశ్వర కాలనీ, గంధంగూడ గ్రామం, డిస్కవరీ స్కూల్, కార్‌వెల్ హోమ్, శివగంగా కాలనీ, వెంకటేశ్వర కాలనీ డైమండ్ వ్యాలీ, ప్రశాంత్‌నగర్, తిరుమల గార్డెన్, రాధా రిపేట్స్ ఫేస్–2, పావనీ హార్మనీ విల్లాస్, బచ్‌పన్ స్కూల్, పార్ట్ ఆఫ్ పద్మశ్రీ హిల్స్ మెయిన్ రోడ్డు, సన్‌సిటీ ఫీడర్ పరిధిలో 4 గంటల నుంచి 4.30 వరకు హిమగిరి నగర్, గంధంగూడ, వెస్టెండ్ కాలనీ, శాంతినగర్, లక్ష్మీనగర్, హైదర్షాకోట్ గ్రామం తదితర ప్రాంతాల్లో కోత ఉంటుందన్నారు.

కాటేదాన్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో...

మైలార్‌దేవ్‌పల్లి: కాటేదాన్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని మరమ్మత్తుల కారణంగా శనివారం విద్యుత్ కోత ఉంటుందని విద్యుత్ అధికారులు తెలిపారు. దుర్గానగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.30 నుంచి 3 గంటల వరకు దుర్గానగర్, దుర్గా హిల్స్, టీఎన్‌జీవోస్ కాలనీ, అయ్యప్ప స్వామి టెంపుల్, మైలార్‌దేవ్‌పల్లి కల్లు కంపౌండ్, శాంతినగర్, గణేష్‌నగర్ స్వప్న థియేటర్ ప్రాంతం తదితర ప్రాంతాల్లో ఈ కోత ఉంటుందన్నారు.

అవగాహనతో టీబీకి చెక్


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మైలార్‌దేవ్‌పల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్షయ వ్యాధి(టీబీ) నిర్మూలనకు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నాయని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. వరల్డ్ టీబీ డే సందర్భంగా శుక్రవారం టీబీ నిర్మూలనపై అవగాహన పెంచే ఐఈసీ ప్రచార కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... క్షయ వ్యాధి పూర్తిగా నయం చేయగలిగే వ్యాధి కానీ సరైన అవగాహన లేకపోవడం, నిర్లక్ష్యం కారణంగా ఇది ఇంకా సమస్యగా మారిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు టీబీ ముక్త్ భారత్ లక్ష్యాన్ని ముందుంచుకొని ఉచిత పరీక్షలు, మందులు, పోషకాహార మద్దతు అందిస్తుందన్నారు. ప్రజలందరూ దీనిపై అప్రమత్తంగా ఉండి, లక్షణాలు కనిపించిన వెంటనే పరీక్షలు చేయించుకోవాలన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ రహీం మాట్లాడుతూ... టీబీ నిర్మూలనలో ప్రత్యేక హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేసి ప్రజలకు ఉచితంగా మైక్రోస్కోపీ పరీక్షలు, ఎక్స్ రే స్కానింగ్, రక్త పరీక్షలు అందిస్తున్నామన్నారు. టీబీ రోగులకు సరైన వైద్య సేవలు, పోషకాహారం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం నిక్షేపం కింద ఆర్థిక సహాయాన్ని అందదిస్తుందన్నారు. టీబీ అలర్ట్ ఇండియా ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ కిరణ్ మాట్లాడుతూ... ఈ కార్యక్రమాల ద్వారా ప్రజల్లో టీబీ పట్ల భయం పోగొట్టడమే కాకుండా, వైద్య పరీక్షలు చేయించుకోవడానికి ప్రోత్సహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించి టీబీ లక్షణాలు కనిపించిన వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిల్లో ఉచితంగా అందుబాటులో ఉన్న వైద్య సేవలు వినియోగించుకోవాలన్నారు. టీయూ టీబీ సూపర్‌వైజర్ నరేష్‌కుమార్, హెల్త్ ప్రొఫెషనల్ మధుబాబు, ఆశా కార్యకర్త పద్మలత తదితరులు పాల్గొన్నారు.

ఆర్చరీలో రాణించిన నార్సింగి క్రీడాకారులు


బంగారు పతకాన్ని అందుకున్న విహాన్‌రాజ్

మణికొండ: జాతీయ ఆర్చరీ పోటీలలో రాష్ట్రం తరపున పోటీ పడిన నార్సింగి క్రీడాకారులు రాణించారు. 6వ ఎన్‌టీపీసీ చెరుకూరి లెనిన్ వోల్గా మెమోరియల్ జాతీయ ఆర్చరీ చాంపియన్ షిప్ పోటీలు రెండు రోజులుగా ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులో జరుగుతున్నాయని నార్సింగి కోచ్ స్వామి తెలిపారు. అండర్–10 సంవత్సరాల బాలుర విభాగంలో పోటీ పడిన కె.విహాన్‌రాజ్ బంగారు, రజిత పతకాలను సాధించాడని ఆయన వివరించారు. మరో క్రీడాకారుడు కె.పూర్ణచంద్ బంగారు పతకాన్ని సాధించాడన్నారు. రోజూ మూడు గంటల పాటు కఠోర సాధనతోనే వీరు పతకాలు సాధించారని, వారిని మరింత తీర్చి దిద్ది రాబోయే పోటీలలోను పతకాలు సాధించేందుకు పూర్తి స్థాయిలో కృషి చేస్తామన్నారు. నార్సింగికి చెందిన ఇద్దరు క్రీడాకారులు పతకాలను సాధించటంతో వారి తోటి క్రీడాకారులు, స్థానికులు వారిని అభినందించారు.

'హ్యాకథాన్‌లో రాణించిన సీబీఐటీ విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

మణికొండ: ఉస్మానియా యూనివర్శిటీలో యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ నిర్వహించిన త్రీ డీ ప్రింటింగ్ హ్యాకథాన్‌లో గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ) మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థులు ప్రతిభను చాటుకుని మొదటి స్థానంలో నిలిచారు. దాంతో విద్యార్థులను శుక్రవారం కళాశాలలో ప్రిన్సిపాల్ సీవీ నరసింహులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆవిష్కరణ, ఆచరణాత్మక అభ్యాసం, సంకలిత తయారీ వంటి అత్యాధునిక రంగాలలో శ్రేష్టతను పెంపొందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. వైస్ ప్రిన్సిపాల్ పీవీ రవీందర్‌రెడ్డి, ప్రొఫెసర్ కృష్ణవేణి ఆధ్వర్యంలో విద్యార్థులు రాహుల్, సాయిచందనారెడ్డి, డి.విశ్వేశ్వర్‌గౌడ్‌లతో కూడిన యాంటీ అగ్రి-వీడ్ ప్రింటోవేటర్స్ బృందం సత్తాచాటి మొదటి స్థానంలో నిలిచి రూ. లక్ష పురస్కారాన్ని అందుకోవటం అభినందనీయమన్నారు.

ద్విచక్ర వాహనాలపై స్టంట్లు చేస్తున్న యువకులపై కొరడా

- తనిఖీల్లో 9 ద్విచక్ర వాహనాలు స్వాధీనం
- అదుపులోకి నలుగురు యువకులు

రాజేంద్రనగర్: ద్విచక్ర వాహనాలపై స్టంట్లు చేస్తున్న వారే లక్ష్యంగా రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసుల గురువారం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. అత్తాపూర్, నా నంబర్, రాజేంద్రనగర్ రోడ్లపై స్టంట్లు చేస్తున్న 9 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నలుగురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల సమాచారం మేరకు... ప్రధాన రహదారులతో పాటు అంతర్గత బస్తీల్లో కొందరు యువకులు ద్విచక్ర వాహనాలపై స్టంట్లు చేస్తూ స్థానికులతో పాటు వాహనదారులకు భయాందోళనకు గురి చేస్తున్నారు. ర్యాష్‌గా వాహనాలు నడపటంతో పాటు స్టంట్లు చేస్తూ సెల్ ఫోన్లలో చిత్రీకరిస్తూ హంగామా చేస్తున్నారు. రాత్రి సమయంలో ఈ విన్యాసాలు పెరిగిపోతున్నాయి. దీంతో ట్రాఫిక్ పోలీసులు రాత్రి 9 గంటల నుంచి నా నంబర్, అత్తాపూర్, రాజేంద్రనగర్ రోడ్లపై ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. స్టంట్లు చేస్తున్న 9 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులను యువకులు వాహనాలను వదిలి పారిపోయారు. నలుగురు యువకులను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. వాహన యజమానులతో పాటు వాహనాలను నడిపించిన వారిపై కేసులను నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు. మైనర్లు అయితే వారి తల్లిదండ్రులతో పాటు వాహన యజమానిపై కేసు నమోదు చేస్తామన్నారు.

ఇరుకు రోడ్డును విస్తరించాలి: బీఆర్ఎస్


ఇరుకుగా ఉన్న రోడ్డును పరిశీలించిన బీఆర్ఎస్ నాయకులు

మణికొండ: వెడల్పుగా ఉన్న రోడ్డు ఒక చోట ఇరుకుగా మారినా అధికారులు పట్టించుకోవటం లేదని, అదే రోడ్డులో బహుళ అంతస్తుల నిర్మాణాలకు అనుమతులు యథేచ్ఛగా జారీ చేస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు డి.సీతారాం అన్నారు. శుక్రవారం పార్టీ నాయకులతో కలిసి పుప్పాలగూడ, రాఘవేంద్ర కాలనీలో గుడ్ మార్నింగ్ మణికొండ కార్యక్రమంలో భాగంగా స్థానికుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలు బిగోనియా గేటెడ్ కమ్యూనిటీ పక్క ఉన్న టెన్నిస్ కోర్టు వద్ద రోడ్డు ఇరుకుగా ఉందన్నారు. దాన్ని వెడల్పు చేయాల్సిన విషయాన్ని అధికారులు విస్మరించారన్నారు. రోజూ ఉదయం, సాయంత్రం సమయంలో అక్కడ ట్రాఫిక్ జాం ఏర్పడుతుందని, అనుకోని ప్రమాదాలు జరిగినపుడు అత్యవసర వాహనాలు వచ్చేందుకు ఇబ్బంది ఏర్పడుతుందన్నారు. ఈఐపీఎల్ కార్నర్ స్టోన్ గేటెడ్ కమ్యూనిటీ వెనకాల ఉన్న రోడ్డును సీసీ రోడ్డుగా అభివృద్ధి చేయాలని, అలకాపూర్ టౌన్‌షిప్ రోడ్డు నెంబర్ 7లో డ్రైనేజీ నిర్మాణం చేసి ఆరు నెలలు దాటినా రోడ్డు మరమ్మత్తు చేయలేదని ఆయన వివరించారు. జలమండలి నీరు వేల, పాలా లేకుండా తక్కువ మోతాదులో సరఫరా చేస్తున్నారని, సరఫరా సమయాన్ని పెంచాలని వారు డిమాండ్ చేస్తున్నారని సీతారాం తెలిపారు. పార్టీ ప్రధాన కార్యదర్శి జి.నరేందర్, నాయకులు జి.విఠల్, ఉపేంద్రనాథ్‌రెడ్డి, శ్రీకాంత్, కిరణ్, మాల్యాద్రినాయుడు, భానుచందర్, సుమనళిని, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

బహుళ సంస్కృతిని కాపాడుకోవాలి

రాయదుర్గం: విభిన్న సంస్కృతుల కలయికతో భారతదేశం బహుళ సాంస్కృతిక కేంద్రంగా సాగుతోందని, దాన్ని ఉత్సవాల ద్వారా కాపాడుకోవాలని హెచ్‌సీయూ మానవీయ శాస్త్రాల విభాగాధిపతి ఆచార్య ఎం.టి. అన్సారి పేర్కొన్నారు. ఉగాది పండగను పురస్కరించుకొని హెచ్‌సీయూలో శుక్రవారం మానవీయ శాస్త్రాల విభాగం ఆడిటోరియంలో తెలుగుశాఖ ఆధ్వర్యంలో ఉగాది ఉత్సవాలను ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగాది ఉత్సవాల సందర్భంగా దేశ వ్యాప్తంగా వివిధ పేర్లతో జరిగే ఉగాది పండుగ విశేషాలను వివరించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య పిల్లల మర్రి రాములు మాట్లాడుతూ ఉగాది ప్రకృతికి సంబంధించినదని ప్రకృతి చిగుర్చినట్లుగానే మానవులలో కొత్త ఆలోచనలకు బీజం వేసే పండగగా అభివర్ణించారు. హెచ్‌సీయూ అధ్యాపక సంఘం అధ్యక్షుడు ఆచార్య బంగ్యాభూక్యా ,తెలుగుశాఖ పూర్వ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు మాట్లాడారు. కవిత వినిపించారు. తెలుగుశాఖ అధ్యాపకులు, ఆచార్యులు ఎం గోనా నాయక్, డి విజయలక్ష్మి, పి వారిజారాణి, త్రివేణి, డాక్టర్ భూక్య తిరుపతి, డాక్టర్ బి భుజంగరెడ్డి, డాక్టర్ పి విజయ్‌కుమార్, డాక్టర్ బాశెట్టి లత, థియేటర్ ఆర్ట్స్ ఆచార్య అనురాధ, ఆంగ్లశాఖ అధ్యక్షుడు ఆచార్య ఎం మురళీమనోహర్, తులనాత్మక అధ్యయనశాఖ అధ్యక్షుడు ఆచార్య జే భీమయ్య, సంస్కృత శాఖ డా.వేదనిధి, విద్యార్థులు పాల్గొన్నారు.